# ప్రారంభమైన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు

**కూకట్‌పల్లి, న్యూస్‌టుడే:** పీహెచ్‌డీలో ప్రవేశానికి సోమవారం జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగంలో ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు మొత్తం 108 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 93 మంది వచ్చారు. 15 మంది గైర్హాజరయ్యారు. ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ పర్యవేక్షణలో జరిగిన ఇంటర్వ్యూలో ఆయా విభాగాల నిపుణులైన అధ్యాపకులు అభ్యర్థుల ధ్రువపత్రాలను తనిఖీ చేసి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ ఇంటర్వ్యూలు 10వ తేదీ వరకు కొనసాగుతాయని బాలునాయక్ చెప్పారు.



**అభ్యర్థులతో మాట్లాడుతున్న అధికారులు**

# ఐదేళ్లలో 'ఎర్త్ సైన్స్' అద్భుతాలు

అందుబాటులోకి వందలాది మంది నిపుణులు

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి వెల్లడి

యూనివర్సిటీ అభివృద్ధిపై ప్రణాళికకు రూపకల్పన

ఎర్త్‌సైన్స్ ప్రస్తుత పరిస్థితి, వర్సిటీ అవసరాలపై నివేదిక

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం వచ్చే ఐదేళ్ళలో వందలాది మంది భూశాస్త్ర నిపుణులను అందించే అవకాశం ఉందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ దిశగా యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికను ప్రభుత్వ ఆదేశం మేరకు ఆయన రూపొందించారు. ఈ 'వ్యూహాత్మక నివేదిక'ను ఆయన బుధవారం మీడియాకు విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 2 వేల మంది భూగర్భ శాస్త్రవేత్తల డిమాండ్ ఉందని, భవిష్యత్‌లో ఇది మరింత పెరుగుతుందని ఆయన నివేదికలో పేర్కొన్నారు. వర్సిటీ బొగ్గు గనులకు దగ్గరగా ఉండటం వల్ల ఇక్కడి విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో మార్కెట్లోకి వస్తారని తెలిపారు. నదీ జీవావరణం, మైనింగ్, వాతావరణ అనుకూలతపై కేంద్రీకృత పరిశోధనల లోటును ఇది తీరుస్తుందని చెప్పారు. దేశ విదేశాల్లో ఈ రంగం అవకాశాలు, అవసరాలు, పురోభివృద్ధి గురించిన పలు అంశాలను బాలకిష్టారెడ్డి నివేదికలో పొందుపరిచారు.

**ప్రస్తుత పరిస్థితి..**

జియోథర్మల్ ఎనర్జీ, లిథియం, కోబాల్ట్ వంటి ఖనిజాలపై ఇటీవల కాలంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. మైనింగ్ జియాలజిస్టుల అవసరం పెరుగుతుంది. అంతర్జాతీయ సంస్థలు కూడా ఎర్త్‌సైన్స్ నిపుణుల కోసం వెతుకుతున్నాయి. చమురు, గ్యాస్ అన్వేషణలోనూ వీరి పాత్ర పెరుగుతోంది. గ్రహ, అంతరిక్ష శాస్త్రాలు భూవిజ్ఞాన శాస్త్రవేత్తలను నియమిస్తున్నాయి.

**ఏం చేయాలి..**

- భవిష్యత్‌లో భూగర్భ శాస్త్రం, పర్యావరణ శాస్త్రం, నదీశాస్త్రం, బొగ్గు భూగర్భ శాస్త్రం, మైనింగ్ టెక్నాలజీ, జీఐఎస్, రిమోట్ సెన్సింగ్‌లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు డిమాండ్ ఉంటుంది. వీటిని ఎర్త్ సైన్స్ వర్సిటీలో అందుబాటులోకి తేవాలి.
- భూకంప శాస్త్రం, ఖనిజ అన్వేషణ, జల వనరుల కోసం కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వీటికి జాతీయ, అంతర్జాతీయ గ్రాంటు అందేలా చేయాలి. అత్యాధునిక ప్రయోగశాలలు, స్మార్ట్ తరగతి గదులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, గ్రీన్ క్యాంపస్ నిర్మాణం అవసరం.
- సామాజిక, పరిశ్రమల భాగస్వామ్యం ఉండాలి. విపత్తు తీవ్రత తగ్గింపు, నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. విదేశీ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం పెంచాలి. విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, కేరీర్ సేవలు అందించాలి.

**ఎలాంటి కోర్సులు ఉండాలి?**

మొదటి ఐదు సంవత్సరాలకు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి కొన్ని కోర్సులు సూచించారు. బీఎస్సీ జియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జియో ఇన్ఫర్మేటిక్స్, బీటెక్, ఎంఎస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ, మైన్ సేఫ్టీలో డిప్లొమా, రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ పీజీ డిప్లొమా కోర్సులు ఇందులో ప్రధానమైనవి. విపత్తు నిర్వహణ, పునరుత్పాదక శక్తి, జియో హెల్త్, యాడ్ ఆన్ సర్టిఫికెట్లు, అంతర్జాతీయ ద్వంద్వ డిగ్రీలు ఉండాలి. ఆయా కోర్సులకు సంబంధించి దేశంలోని ప్రధాన ఐఐటీలు, ఐఐఎస్‌సీలు, .ఏఎన్‌యూ, సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్ఐతో సమన్వయం చేయాలి. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలి.

- 64 మంది బోధన సిబ్బంది, 29 మందికి పైగా బోధనేతర సిబ్బంది, జియో ఎనర్జీ నిపుణులు, మైనింగ్ ఆటోమేషన్ నిపుణులు, శాస్త్రవేత్తలు కనీసం ఐదుగురిని యూనివర్సిటీకి కేటాయించాలి. ఏఐ ఫర్ ఎర్త్ సిస్టమ్‌పై ఆరు నెలల శిక్షణ ఇవ్వాలి.

**ప్రారంభ బడ్జెట్ రూ.13.06 కోట్లు**

ఈ వర్సిటీలో ప్రారంభంలో నాలుగు కోర్సులు ప్రవేశ పెడుతున్నారు. బీఎస్సీ జియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఎంఎస్సీ జియాలజీ, ఎంఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ కోర్సులు ఉంటాయి. ఆయా కోర్సులకు అవసరమైన ప్రయోగాలు, పరికరాల కోసం రూ.1.95 కోట్లు, తరగతి గదులు, లేబొరేటరీల నిర్మాణం, పునరుద్ధరణ కోసం రూ.11.11 కోట్లు.. మొత్తంగా 2025–26కు 13.06 కోట్లు కేటాయించాలి.

**ఎర్త్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా బాలకిష్టారెడ్డి?**



ఎర్త్ వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా బాలకిష్టారెడ్డి పేరును ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఇందుకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు వెలువడే వీలుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఈ బాధ్యతల్లో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉన్నారు. పని ఒత్తిడి కారణంగా ఆమె యూనివర్సిటీపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించలేక పోతున్నారని ఖమ్మం జిల్లా మంత్రులు ఇద్దరు సీఎం దృష్టికి తెచ్చినట్టు తెలిసింది. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

# ఢిల్లీలో వర్సిటీ స్టాల్ సందర్శించిన వీసీ



అకడమిక్ జంక్షన్ స్టాల్ వద్ద టీకేకే రెడ్డి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: న్యూఢిల్లీ భరత్ మండపంలో జరుగుతున్న జియో స్మార్ట్ ఇండియా కాన్ఫరెన్స్, ఎక్స్‌పోలో జేఎన్‌టీయూ బీటెక్ జియో ఇన్ఫర్మేటిక్స్ విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాల్‌ను బుధవారం వీసీ డాక్టర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి సందర్శించారు. అకడమిక్ జంక్షన్ పేరుతో స్టాల్ ఏర్పాటు చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. అంతకుముందు .ఆయన సదస్సులో పాల్గొని 'కెరీర్ పాత్‌వేస్ అండ్ పేస్కేల్ ఇన్‌స్పైరింగ్ ది నెక్స్ట్ జనరేషన్ ఆఫ్ స్పేస్ అండ్ జియోస్పేషియల్ ప్రొఫెషనల్స్' అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.విజయలక్ష్మి పాల్గొన్నారు.